# ధర్మాత్ముడు

మన పురాణాలలోని పాత్రల పేర్లు ఎలా పెట్టారోగాని అవి సార్థక నామధేయాలైపోయాయి. వేదాలను విస్తరింపజేశాడు గనుక వేదవ్యాసుడు అని పేరు వచ్చింది. ఏదైనా విషయాన్ని విస్తరింపజేసి రాయడమే 'వ్యాసము' అయింది. ధర్మాన్ని పాటించే వాడు గనుక పాండవాగ్రజునికి 'ధర్మరాజు' అనే పేరు సార్థకమైంది.

'ధర్మాత్ముడు' అని అతనికి వాళ్ల నాన్నగారు ఎలా పేరు పెట్టారోగాని అతడు సార్థకనామధేయుడే!

'శ్రీరామభక్త సమాజం' వాళ్లు "తమరు సహకరించాలి" అని అడిగితే "నావంతు వెయ్యి నూటపదహార్లు" అని ఠక్కున మాట యిచ్చారు. శ్రీరామభక్త సమాజం వాళ్లు ఉబ్బితబ్బిబైపోయి, వెంటనే వెయ్యి నూటపదహార్లకి రసీదు యిచ్చేశారు. "ఓ వారం రోజులు పోయేక కనబడండి. మీ డబ్బు మీకిచ్చేస్తాను" అన్నారు ధర్మాత్ముడు గారు. అన్నమాట ప్రకారమే వారం రోజులు పోయేక ఆయన డబ్బిచ్చేశారు. శ్రీరామభక్త సమాజం వాళ్లు ఆశ్చర్యపోయారు!

తరువాత సిద్ధివినాయక నవరాత్ర్యుత్సవాలు, జరుపుతామని 'సిద్ది వినాయకయువజన సంఘం' వాళ్లు వచ్చారు. వాళ్లు కూడా ముందుగా వెయ్యినూట పదహార్లకిరసీదు ఇచ్చేసి, వారం రోజులు పోయేక వస్తే, వాళ్లక్కూడా ధర్మాత్ముడుగారు అంత డబ్బూ యిచ్చేశారు. వాళ్లు కూడా ఆశ్చర్య చకితులైపోయారు!

పిమ్మట 'దేవీ నవరాత్ర్యుత్సవ సంఘం' వారు వచ్చారు. వాళ్లు కూడా ముందుగా వెయ్యినూట పదహార్లకి రసీదు యిచ్చేసి వారం రోజులు పోయేక వచ్చారు. వాళ్లకీ ధర్మాత్ముడుగారు అలాగే డబ్బిచ్చేశారు.

"అదేమిటట్సార్! తమరు పెద్దవారు. తమకు చెప్పవలసిన వాళ్లం కాము. వెయ్యి నూట పదహార్లివ్వవలసిన వాళ్లు ఒక్క నూట పదహార్లే యిచ్చారేమిటి?" అన్నాడు ఉత్సవ సంఘం సెక్రటరీ.

"నేనందరికీ ఇలాగే ఇచ్చేనయ్యా బాబూ! నువ్వే పొరపాటు పడ్డావ్. మీవంతు, ఎంత వెయ్యమంటారంటే 'నా వంతు వెయ్యి - నూటపదహార్లు, అన్నాను. నువ్వు వెయ్యి నూట పదహార్లు వేసుకుంటే ఆ తప్పునాదా?" అన్నారు ధర్మాత్ముడుగారు.

దేవీ నవరాత్ర్యుత్సవ సంఘం వాళ్లు

'శ్రీరామభక్తసమాజం' వాళ్లనీ 'సిద్ధి వినాయక యువజన సంఘం' వాళ్లనీ భోగట్టా చేశారు, ధర్మాత్ముడు గారు వాళ్లకి ఎంతెంత చందా వేశారో అని.

"మాకూ నూట పదహార్లే వేశారండీ బాబూ! ఎవరితో చెప్పుకోడం? ఆయన మాట తప్పరనే నమ్మకంతో వెయ్యి నూట పదహార్లకి రశీదు యిచ్చేశాం. మనమంతా తేలుకుట్టిన దొంగలం!" అన్నారు వాళ్లు.

08-04-92

"ఆంధ్రభూమి" దినపత్రిక